

నిరంతరం సెక్యూరిటీ ఉండాల్సిందే



అత్యవసర సర్వీసులు అందించే వైద్యులకు విభాగాల వద్ద 24 గంటలు పర్యవేక్షణ సెక్యూరిటీ గార్డులు ఉండాలి. ఏదైనా ఇబ్బంది వచ్చినపుడు పోలీసులు తక్షణమే హాజరయ్యేలా టీము పనిచేయాలి. ప్రధానంగా మహిళా డాక్టర్ల వద్ద పూర్తి సెక్యూరిటీ ఉండాలి. ఎమర్జెన్సీ విభాగం, కాజువాలిటీ వద్ద సెక్యూరిటీ పర్యవేక్షణ ఉండాలి. హాస్పిటల్ ప్రవేశం మార్గంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

– డాక్టర్ సుబ్బరాజు వర్మ, చేబ్రోలు, పీహెచ్‌సీ

మహిళా డాక్టరుపై అఘాయిత్యం అమానుషం



మహిళా డాక్టరు హత్యాచారం ఘటన అమానుషం. సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన వారిని క్షమించరాదు. దోషులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని. డ్యూటీలో ఉన్న డాక్టర్లపై దాడులను అరికట్టేలా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేయాలి. అత్యవసర సర్వీసులు అందించే చోట పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ శ్రావణ్‌రెడ్డి, చేబ్రోలు పీహెచ్‌సీ

క్లుప్తంగా

ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



ఆర్‌సీఎం చర్చికి శంకుస్థాపన చేస్తున్న ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పాలిమేర జయరావు

దెందులూరు: నాగులదేవునిపాడులో ఆధ్యాత్మికాభివృద్ధికి నూతన చర్చి నిర్మాణం తలపెట్టడం సంతోషంగా ఉందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పాలిమేర జయరావు అన్నారు. నాగులదేవునిపాడు ఆర్‌సీఎం పారిస్ క్రిస్ట్ ఇంటిగ్రేవియర్ ఆధ్వర్యంలో పీఠాధిపతి జయరావు శంకుస్థాపన చేశారు. సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, ఫాదర్ గ్రేవియర్ పీఠాధిపతి కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపదేశీయులు గార్లపాటి మల్లిక్, రామ్మోహనరావు, పంచాయతీ వార్డు మెంబర్లు శ్రీధర్, రాజీవ్, ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సంఘస్తులు, మరియదళ సభ్యులు, సిస్టర్లు ఉన్నారు.

రైల్వే అండర్‌పాస్‌లో తొలగని వర్షం నీరు



అలుగులగూడెం అండర్‌పాస్‌లో వర్షం నీరు

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద అండర్‌పాసులో నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిలిచిన నీటిని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తోడించడం లేదు. ఈ అండర్‌పాస్ మీదుగా ప్రతి రోజూ విద్యార్థులు, రైతులు, పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అండర్‌పాసులో నిలిచిన వర్షపు నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వృద్ధులు, వాహన దారులు కోరుతున్నారు.

మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

దెందులూరు: దెందులూరు మండలంలో గోపన్నపాలెం, రామారావుగూడెంలో మినీ గ్రంథాలయాలు (బుక్ డిపో సెంటర్లు) మంజూరు చేయాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు. దెందులూరు మండలంలో 10వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు వేలాది మంది నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారు. గోపన్నపాలెంలో గ్రంథాలయం మూతపడి 15 ఏళ్లు అయిందని, రామారావుగూడెంలో మినీ గ్రంథాలయం రద్దు చేసి 4 ఏళ్లు కావస్తోంది. ఒక్క దెందులూరు, పోతునూరు గ్రామాల్లో మాత్రమే గ్రంథాలయాలున్నాయి.17 పంచాయితీల శివారు గ్రామాలకు 2 గ్రంథాలయాలుంటే మిగిలిన గ్రామాల్లో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు పత్రిక, పుస్తకపఠనం ఎలా చేస్తారని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తున్నారు. వెంటనే రామారావుగూడెం, గోపన్నపాలెం గ్రామాల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

చాకుతో దాడి.. ఇద్దరికి గాయాలు

దెందులూరు: దెందులూరులో ఒక యువకుడు మరో ఇద్దరిపై చాకుతో దాడి చేసిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని దెందులూరు ఎస్సై కె.స్వామి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం... పాతకక్షల నేపథ్యంలో దెందులూరు యాదవ బజారుకు చెందిన బత్తిన నాగమహేష్, చేడిగ ఆకాష్ ఏలూరు నుంచి దెందులూరు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే గ్రామంలోని కాశీ కాలనీకి చెందిన వంజరపు అరవింద్ స్థానిక ఎన్‌టీఆర్ బొమ్మ వద్ద నిలుపుదల చేశాడు. బత్తిన నాగమహేష్, చేడిగ ఆకాష్, వంజరపు అరవింద్ మధ్య వాగ్వివాదం పెరిగి ఘర్షణ జరిగింది. వంజరపు అరవింద్ చాకుతో బత్తిన నాగమహేష్‌ను పొట్టలో కుడివైపున పొడిచాడు. ఆకాష్ ఎడమ చేతి మణికట్టుపై దాడి చేశాడు. ఈ సంఘటనలో నాగమహేష్, ఆకాష్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు దెందులూరు సీహెచ్‌సీకి తరలించారు. నాగమహేష్, ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వంజరపు అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గణపవరం: మండల సర్పంచ్‌ల ఛాంబర్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం గణపవరం మండల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు చనుమూరి దుర్గా భవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఛాంబర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లూరు సర్పంచ్ ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వెంకట్రాజపురం సర్పంచ్ మల్లంపల్లి సురేష్, కోశాధికారిగా చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు, సభ్యులుగా గుర్రంసుబ్బారావు (వరదరాజపురం), ఆదిమూలం సురేష్(వాకపల్లి), బాతు నాగేశ్వరావు (జల్లికాకినాడ) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, ఎంపీడీవో అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు అభినందించారు.

నూతన ఓటరు జాబితాపై సర్వే

- ఆర్డీవో ఖాజావలి వెల్లడి
- బీఎల్వోలకు అవగాహన కల్పించిన తహసీల్దార్లు

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో నూతన ఓటర్ల జాబితా తయారీకి ఇంటింటి సర్వే ఆగస్టు 20వ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఏలూరు ఆర్డీవో ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఓటరు జాబితాను అందరూ పరిశీలించి సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 1వతేదీ నాటికి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆయన సోమవారం తెలిపారు. అందుకు ఫారమ్ 6ను ఉపయోగించాలని సూచించారు. ఓటరు జాబితాలో అక్షర దోషాలు, పేరు మార్పులు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు చేసుకోవచ్చునని ఆర్డీవో ఖాజావలి సూచించారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు

దెందులూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కళాశాలలో ఓటు హక్కు నమోదుపై అవగాహన నిర్వహించాలని దెందులూరు తహసీల్దార్ బి. సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత అన్నారు. మంగళవారం బీఎల్వోలు, గ్రామస్థాయి ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025పై బీఎల్వోలకు తహసీల్దార్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మండలంలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలు సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు అందించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించి నూతన ఓటర్ల జాబితా తయారీకి అధికారులు కృషి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటరుగా చేర్పించేందుకు కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు ప్రియదర్శిని, స్వామిదాసు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, అన్ని గ్రామాల బీఎల్వోలు ఉన్నారు.



బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో అభ్యంతరాల స్వీకరణ

నిడమర్రు: గ్రామాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సరవణ జరుగుతోందని అభ్యంతరాలుంటే ఆయా పరిధిలోని బూత్ లెవెల్ అధికారులకు సంబంధిత ఫారాలు అందించాలని ఎస్, నాగరాజు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై మండలంలోని బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ అక్టోబరు 18 వరకూ ఇంటింటి సర్వే చేసి ఓటరు జాబితాను నూతనంగా తయారు చేయాలన్నారు. ఓటర్లు అందరూ తమ ఓటును పరిశీలించుకుని ఏదైనా సవరణ ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన కొత్త ఓటర్లు అక్టోబరు 1వ తేదీ వరకూ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఓటరు జాబితా సవరణ నిమిత్తం మీ వద్దకు వస్తున్న ఓటర్లు బీల్వోలకు సహకరించాలని మండల ఓటర్లుకు ఆయన విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజకుమారి తదితరులున్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదాం



బాల బాలికలకు అవగాహన కల్పిస్తున్న టీచర్ కె.అనంతలక్ష్మి, పక్కనే హెచ్‌ఎం సునీత

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు కోరారు. ఎయిడ్స్ నియంత్రత విభాగం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు మీకు తెలుసా అనే పేరుతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం గారపాటి సునీత అధ్యక్షత వహించారు. హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే వాటికి దూరంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని కంతేటి అనంతలక్ష్మి, జిల్లా ప్రతినిధి రామకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భోగాపురంలో జ్వరాలపై సర్వే



భోగాపురంలో జ్వరాలపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి కె.శ్రీలక్ష్మీ, మలేరియా జిల్లా సహాయ అధికారి జె.గోవిందరావు



భోగాపురంలో ఓ ఇంట్లో దోమల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలను పంచాయతీ పరిధిలోని భోగాపురంలో విషజ్వరాలు ప్రబలడంతో సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. గ్రామానికి కొంత మంది డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతూ ఏలూరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైద్యారోగ్య అధికారులు ఇంటింటికీ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో కొన్ని రోజులుగా జ్వరాల సర్వే చేయిస్తున్నారు. మంగళవారం గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో జిల్లా సహాయ మలేరియా అధికారి జె.గోవిందరావు, సిబ్బంది జ్వరపీడితుల ఇంటింటికీ వెళ్లి సర్వే తీరును వారు పరిశీలించారు. ఇల్లు, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై వారికి వివరించారు. 30కి పైగా మంది జ్వరాలతో బాధపడుతున్నట్లుగా ప్రాథమికంగా వారు గుర్తించారు. ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు పిచికారీ చేయించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గ్రామంలో అవగాహన ర్యాలీ, ప్రదర్శన

జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలని గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి సూచించారు. భోగాపురంలో జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి జ్వరాల నిర్మూలన, నియంత్రణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా టైఫాయిడ్, డెంగీ, కామెర్లు తదితర వైరల్ జ్వరాలు ప్రబలుతాయన్నారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారంతా వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని, కొంత మంది పరీక్షలు చేయించుకోకుండా మాత్రలు మింగుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. మలేరియా సహాయ అధికారి జే.గోవిందరావు మాట్లాడుతూ పీహెచ్‌సీలో 63 రకాల ఉచిత పరీక్షలు చేస్తున్నారన్నారు. ఎక్కువగా హాని చేసే కీటకం దోమని, నీరు ఎక్కువగా నిల్వ ఉన్న ప్రాంతాల్లో అవి వృద్ధి చెందుతున్నాయన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటిలో ఫ్రైడే డ్రైడేగా పాటించాలని కోరారు. అవగాహనతోనే వ్యాధి నివారణ సాధ్యమన్నారు. సూపర్‌వైజర్లు రామకృష్ణ, నవీన్, సిబ్బంది రమేష్, గోపికృష్ణ, శివానీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

‘మిషన్ వాత్సల్య’ అభాగ్యుల పాలిట వరం



భీమడోలులో మిషన్ వాత్సల్య పథకం లబ్ధిదారులైన చిన్నారులతో ఎంపీడీవో, సీడీపీవో తదితరులు

భీమడోలు: మిషన్ వాత్సల్య పథకం అభాగ్యుల పాలిట వరమని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో ఎంపికైన 40 మంది విద్యార్థులకు నెలకు రూ.4వేల చొప్పున వారి ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులతో వివిధ శాఖల అధికారులు మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పీవో కేవీఎస్ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతి పాల్గొని విద్యార్థుల విద్య, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అభాగ్యులుగా మారిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక లబ్ధి చేకూర్చి ఆ కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తుందన్నారు. నగదును విద్యార్థి అవసరాలకు వినియోగించుకోవాలని, కుటుంబ అవసరాలకు వాడవద్దని కుటుంబ సభ్యులకు సూచించారు. ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరకుమార్, సూపర్‌వైజర్లు ఎండీ షహనాజ్‌బేగం, ఎస్‌కే నూర్జహాన్, ఎం.కవిత, డీసీపీయు సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

భీమడోలు: దేశ వ్యాప్తంగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ అధికారిణి ఏవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో 23–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన రూ.12.98కోట్ల విలువ గల పనులపై సామాజిక తనిఖీ బృందాలు పర్యటించనున్నందున సోమవారం మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్ఆర్‌పీ సూర్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా విజిలెన్స్ అధికారి ఏవీ విజయలక్ష్మి, ఎంపీపీ కనుమాల రామయ్య, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి పాల్గొని ప్రసంగించారు. ఎస్ఆర్‌పీ సూర్య మాట్లాడుతూ మండలవ్యాప్తంగా సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఉపాధి హామీ పథకపు పనులు జరిగిన గ్రామాల్లో సామాజిక తనిఖీలు బృందాలు వేతనదారుల వివరాలు, జరిగిన పనులను పరిశీలించి నివేదికలు తయారు చేస్తారన్నారు. ఈ నెల 5న మండల స్థాయిలో సామాజిక తనిఖీ వేదిక నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ కనుమాల రామయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధిత సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

ఫోటోకాల్ పాటించలేదు

కూటమి నాయకులు ఫీల్ట్ అసిస్టెంట్లపై లేనిపోని ఫిర్యాదులు చేసి వారిని ఇబ్బందులుకు గురి చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు అన్నారు. ఈనెల 23న నిర్వహించిన గ్రామసభల్లోనూ ఎక్కడా ఫోటోకాల్ పాటించలేదని వారు వాపోయారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచులకు సరైన గౌరవం ఇవ్వడంలేదని, ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ముళ్లగిరి జాన్సన్, ఇంజేటి జూనియర్, గంటా శ్రీనివాసరావు, ఆళ్తి గోపి తదితరులు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దృష్టికి ఈ సమస్యలను తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏపీవో కె.పద్మ, గ్రామకార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా శ్రీకృష్ణుని విగ్రహం నిమజ్జనోత్సవం



భీమడోలులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న రాజస్తానీ మహిళలు

భీమడోలు: తమ కుల దైవం శ్రీకృష్ణుని జన్మాష్టమిని రాజస్తానీ మహిళలు ఘనంగా జరుపుకున్నారు. భీమడోలు జంక్షన్ సమీపంలోని రాజస్తానీ మహిళలు తన ఇష్ట దైవం శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. మంగళవారం భీమడోలులో వారంతా సుందరంగా అలంకరించిన రాధా, కృష్ణుని విగ్రహాన్ని తమ నెత్తిపై పెట్టుకుని మోస్తూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాజస్తానీ యువతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. వ్యాపారాల రీత్యా ఈ ప్రాంతంలో స్థిరపడిన వీరంతా ఏటా శ్రీకృష్ణుని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వచ్చి భీమడోలులోని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి



కమాండింగ్ అధికారి అమిత్ పాండేకు వివేకానందుని బొమ్మ అందించి సత్కరిస్తున్న గౌతమ్‌కుమార్

భీమడోలు: ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలని కమాండింగ్ అధికారి అమిత్ పాండే అన్నారు. పోలసానిపల్లి గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ యువజన విభాగం (ఎన్‌సీసీ)పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ఎన్‌సీసీ క్రెడిట్స్ కమాండింగ్ అధికారి అమిత్ పాండే, అసోసియేట్ అధికారి రిషబ్‌కు గౌరవ వందనం అనంతరం ఘన స్వాగతం పలికారు. కళాశాల అసోసియేట్ అధికారి మలిశెట్టి గౌతంకుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ విధానాన్ని పరిశీలించారు. ఎన్‌సీసీలో యువత ఎక్కువగా చేరాలని కోరారు. ఎన్‌సీసీ అందించే సర్టిఫికెట్లతో యువత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సెప్టెంబర్ 6న ఆర్మీలో చేరేందుకు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి చక్కని తర్ఫీదును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.సత్యనారాయణ, అధ్యాపకులు ఎం.ఉదయ్‌కిరణ్, పి.వెంకటేశ్వరరావు, అంబేడ్కర్, విద్యార్థులు పాల్గొ

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: మత్తు పదార్థాలు, చెడు అలవాట్లను ప్రోత్సహించే వారికి విద్యార్థులు దూరంగా ఉండాలని నిడమర్రు ఎస్సై ఎన్ వీరప్రసాద్ అన్నారు. మంగళవారం యాంటీ డ్రగ్ క్లబ్ ఆధ్వర్యంలో పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో మాదకద్రవ్యాల నిర్మూలన, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చెడు స్నేహాలు, చెడు అలవాట్లను వదిలేయాలని, తల్లిదండ్రులు, గురువుల మాటలను వినాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మీస్నేహితుల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు దగ్గరవుతున్నట్టు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా టీచర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, జాకబ్‌రాజు తదితరులున్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి



గణపవరం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం: రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ దిశగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము) అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి మండలంలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వెటర్నరీ వైద్యురాలు నాగజ్యోతి మాట్లాడుతూ రైతులంతా తమ పశువులకు బీమా చేయించుకోవాలని, ఇందుకోసం రైతు రూ.400 చెల్లిస్తే, పశువులకు మరణం సంభవిస్తే రైతుకు రూ.30వేల పరిహారం లభిస్తుందన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు పులపర్తి సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తులసి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వెంకటేశ్వరరావు తమ శాఖలకు సంబంధించిన అంశాలు వివరించారు. కొత్తపల్లి సర్పంచ్ మద్దాల రత్నకుమారి మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు నిర్మించాలని కోరారు. ఆర్అండ్‌బీ అధికారి మాట్లాడుతూ మండలంలో రోడ్ల నిర్మాణానికి రూ 6.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న గణపవరం, కేశవరం వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్‌ఎంపీపీ సలాది రత్నకుమారి, ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీఎం రాజేష్, ఎఫ్‌డీవో శివప్రసాద్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



బస్సుపాస్‌లు పంపిణీ చేస్తున్న డీఎం సత్యనారాయణమూర్తి, దాత పెద్దిరెడ్డి కృష్ణప్రసాదరావు

ఉంగుటూరు: దాతలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజరు వై.సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం కైకరం హైస్కూల్లో హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన విద్యార్థులకు ఉచిత బస్‌పాసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బస్‌పాసులకు అయిన ఖర్చును పెద్దిరెడ్డి గోపాల కృష్ణ ప్రసాదరావు అందజేశారు. విద్యాకమిటీ ఛైర్మన్ అల్లూరు జగన్మోహిని, వైస్ ఛైర్మన్ కె. బలరామకృష్ణ, ఆర్టీసీ పీఆర్వో డి.విజయకుమార్, దాత ప్రసాదరావును డీఎం శాలువాతో సత్కరించారు.

చేతులు కోసుకుని యువకుడి హల్‌చల్

పెదపాడు: రామవరప్పాడుకు చెందిన యువకుడు తన చేతులను బ్లేడుతో కోసుకుని చనిపోతానంటూ మంగళవారం రోడ్డుపై హల్‌చల్ చేశాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలంలోని కలపర్రు సాయిబాబు గుడి సమీపంలో ఓ యువకుడు చేతిని కోసుకుని జాతీయ రహదారిపై కూర్చుని ఉండటాన్ని స్థానికులు గమనించి పెదపాడు ఎస్సై శుభశేఖర్‌కు సమాచారం అందించారు. పెదపాడు పోలీసు సిబ్బంది యువకుడి వద్దకు వచ్చి వివరాలు అడిగారు. అనంతరం అతడ్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు.